ప్రజాశక్తి
బుధవారం 9 నవంబర్ 2022
5
పార్వతీపురం మన్యం



ఇద్దరు డిఎస్‌పిలకు బదిలీ

- 'దిశ'కు వెంకటేశ్వర్లు
- పాలకొండకు కృష్ణారావు నియామకం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఇద్దరు డిఎస్‌పిలు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డిఎస్‌పిలను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా విజయనగరంలోని దిశ పోలీసుస్టేషన్ డిఎస్‌పి టి.త్రినాధరావు విశాఖ సౌత్ జోన్ ఎసిపిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పోలీసు ప్రధాన కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ఎం.వెంకటేశ్వర్లు దిశ డిఎస్‌పిగా నియమితులయ్యారు. పాలకొండ డిఎస్‌పి ఎం. శ్రావణి ఇక్కడ నుంచి బదిలీ అయ్యారు. రెండేళ్ల క్రితం ఇక్కడ బాధ్యతలు చేపట్టిన ఆమె విజయవాడ మంగళగిరి కార్యాలయానికి రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇక్కడ డిఎస్‌పిగా జివి కృష్ణారావును నియమించారు. అయితే విజయనగరం డిఎస్‌పి పోస్టు మాత్రం ఈ బదిలీల్లోనూ భర్తీకి నోచుకోలేదు.



సమావేశంలో మాట్లాడుతున్న మన్మధరావు

స్టీల్ ప్లాంట్‌ను నూరు శాతం సామర్థ్యంతో నడిపించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మడం లేదని, రాష్ట్రానికి విభజన చట్టం హామీలు అమలు చేస్తామని ఈనెల 12న విశాఖపట్నంలో జరుగు బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ స్టీలు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనంలో మంగళవారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అఖిలపక్ష, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రధాని నరేంద్రమోడీ కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణకు 633 రోజుల నుంచి కార్మికులు, ప్రజలు అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. ప్రధానమంత్రి ఈనెల 12న విశాఖపట్నం పర్యటన చేయడం అంటే రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని అన్నారు. కావున ఈనెల 12న పర్యటనలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మడం లేదని విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నూరు శాతం సామర్థ్యంతో నడిపిస్తామని ఆంధ్రప్రదేశ్‌కు విభజన చట్టం హామీలు అమలు ప్రత్యేక వాద అమలు చేస్తామని ప్రకటించాలని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 11న పార్వతీపురంలో జరుగు నిరసన కార్యక్రమాన్ని ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, జనసేన నాయకులు వి.దాలినాయుడు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు నరసింగరావు. రైతు కూలీ సంఘం నాయకులు బాషా, విశ్వేశ్వరరావు. సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు, పట్టణ నాయకులు సూరిబాబు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పడాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలు అంతంత మాత్రమే

సమయానికి రారు....స్థానికంగా ఉండరు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు సంక్షేమ పథకాలు చేరువే సేందుకు ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. వాటి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని భావించింది. 1000 మంది జనాభాకు ఒక్కొక్క సచివాలయం ఏర్పాటు చేసి అందులో శాఖల వారీగా కార్యదర్శులను నియమించింది. అయితే ఆ దిశగా ఆశించిన స్థాయిలో సచివాలయాల్లో సేవలు అందడం లేదు. ప్రజలకు అంతంత మాత్రంగానే సేవలు అందుతున్నాయి. సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయ సిబ్బంది స్థానికంగా ఉండకుండా ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుండడం వల్ల సమయపాలన పూర్తిగా గాడి తప్పుతుంది. దీంతో సచివాలయ వ్యవస్థ లక్ష్యం నీరుగారుతుంది. దీంతో సచివాలయాల సేవల పట్ల ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిని పట్టించుకోవాల్సిన అధికారులు కూడా చూసిచూడని ధోరణిలో నడుస్తున్నారు. దీంతో సచివాలయాల సేవలు పట్ల ప్రజలు విస్తుపోతున్నారు.

కానరాని సిబ్బంది

సచివాలయాల్లో పూర్తిగా సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాల్సి ఉంది. ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం చేపట్టాల్సి ఉంది. అయితే మండలంలో 31 సచివాలయాల్లోనూ సిబ్బంది మాత్రం అందుబాటులో ఉండడం లేదు. దీంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. యూనీఫారాలు ధరించి కార్యాలయాలకు రావాల్సి ఉన్నప్పటికీ క్రమశిక్షణ లేకుండా యూనీఫారాలు ధరించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సచివాలయాలకు వచ్చామా వెళ్లామా అన్న



సిబ్బందిలేక బోసిపోయిన పట్టణంలోని ఓ సచివాలయం

పరిస్థితిలో సిబ్బంది పనిచేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం బయోమెట్రిక్ హాజరువేసి మూవెమెంట్ రిజిస్టర్‌లో సంతకాలు చేసి కనీసం సచివాలయాలకు అందుబాటులో ఉండని పరిస్థితి ఉన్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. కుల, ఆదాయ ధృవపత్రాలు మంజూరుకు కూడా కనీసం వారం రోజులు సమయం పడుతుందని ప్రజలు వాపోతున్నారు. గతంలో రెండు రోజులకే మంజూరయ్యాయని, సచివాలయ వ్యవస్థ వల్ల వారం రోజులు పడుతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆన్‌లైన్‌లో పొందుపర్చిన దరఖాస్తులకు సకాలంలో కార్యదర్శి స్పందించకపోవడం వల్ల అవి తిరస్కరించే పరిస్థితి కనిపిస్తుంది. దీంతో మరలా దరఖాస్తులు చేసుకునే పరిస్థితి దరఖాస్తుదారులకు ఎదురవుతుంది. అయితే కొంత మంది సచివాలయ సిబ్బంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వారు సమయానికి రావడం లేదు. సచివాలయ సిబ్బంది పని చేసే గ్రామంలోనే ఉండాలనే నిబంధన ఉన్నా దానిని ఎవరూ పట్టించుకోవడం లేదు. అయితే సిబ్బంది సమయపాలన పాటించకపోవడానికి కార్యదర్శుల పర్యవేక్షణ లోపమేనని పలువురు వాపోతున్నారు.

సచివాలయాలకు వాలంటీర్లుకు అనుసంధానం కరువు

50 ఇళ్లకు మ్యాపింగ్ చేసి ఒక్కొక్క వాలంటీర్‌ను ప్రభుత్వం నియమించింది. వారు సచివాలయ పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే ఆశించిన స్థాయిలో వారు కూడా విధులు నిర్వహించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి సకాలంలో లబ్ధిదారులను ఎంపిక చేయకపోవడం, వారి అర్హత గుర్తించకపోవడం పట్ల లబ్ధిదారులు పదేపదే సచివాలయాలు చుట్టు ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి వస్తుంది. వాలంటీర్లుకు, సచివాలయాలకు మధ్య సమన్వయం లేకపోవడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. ఇప్పటికైనా సచివాలయ వ్యవస్థ బాగుపడాలని ప్రజలు కోరుతున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలులో ఏ ఒక్క రైతు నష్టపోకుండా పూర్తి స్థాయి సన్నద్ధతతో ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖ మండల అధికారులతో ధాన్యం కొనుగోలు, ఇకెవైసి నమోదు, రబీ సీజన్ ప్రణాళిక, తదితర అంశాలపై కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ మంగళ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలులో ఏ ఒక్క రైతు నష్టపోకుండా రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ అధికారులు సమన్వయంతో ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. రబీ కి అవసరమైన విత్తనాలను సకాలంలో సరఫరా చేసేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎపి సీడ్స్ డిఎంను ఆదేశించారు. ఎన్‌పిసిఎల్ అనుసంధానం త్వరగా పూర్తిచేసి అర్హులైన రైతులకు రైతు భరోసా మంజూరు చేయాలన్నారు. ఇ- క్రాప్ నమోదు, సోషల్ ఆడిట్‌లో వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి తుది జాబితాను ప్రచురించాలని స్పష్టం చేశారు. పిఎం కిసాన్ పథకంలో పెండింగ్‌లో ఉన్న ఇకెవైసి నమోదు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. జీడి పంట పూత దెబ్బ తిన్నందున తోట బడి కార్యక్రమం కింద ఉద్యానవన రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యానవనాధికారి కె.సత్యనారాయణ రెడ్డిని ఆదేశించారు. పశువులకు సోకుతున్న లింపీ స్కిన్ (బొబ్బర్ల వ్యాధి) నియంత్రణకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించాలని పశు సమర్ధక శాఖ జెడి ఆరిక ఈశ్వరరావును సూచించారు. ఫిష్ ఆంధ్ర, ఫిట్ ఆంధ్రా కింద జిల్లాలో మంజూరైన షాప్‌లు, ఆక్వా హబ్‌ల నిర్వహణకు చర్యలు పట్టాలని మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయశాఖ జెడి రాబర్ట్‌పాల్, జిల్లా మత్స్య శాఖ అధికారి తిరుపతయ్య, జిల్లా సెరీకల్చరల్ అధికారి పాలరాజ్, తదితరులు, పాల్గొన్నారు.

చెమటను చిందిస్తూ... కుటుంబాలను నెట్టుకొస్తూ

వ్యవసాయరంగంలో రైతు పాత్ర ఎంత కీలకమో, సాగులో తోడ్పాటునందిస్తున్న వ్యవసాయ కార్మికుల పాత్ర కూడా అంతే కీలకం. కానీ వారంతా చెమటను చిందిస్తూ... కుటుంబాలను నెట్టుకొస్తూ... జీవన పోరాటంలో అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి కష్టజీవులకు వ్యవసాయ కార్మిక సంఘం అండగా నిలుస్తోంది. పనులు కల్పించాలని, కూలిరేట్లు పెంచాలని, వారి కోసం ఉన్న కొద్దిపాటి హక్కులనైనా అమలు చేయాలని నిరంతరం పోరాడుతోంది. ఈ నేపథ్యంలో మక్కువ మండల కేంద్రంలో బుధవారం జరగనున్న 9వ జిల్లా మహాసభకు ప్రాధాన్యత సంతరించుకుంది. 2009 సెప్టెంబర్ 5న సీతానగరంలో 8వ మహాసభ జరిగింది. నాటి నుంచి నేటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, వాటి పర్యావసానాల వల్ల వ్యవసాయ కార్మికులకు జరిగిన కష్టనష్టాలు, వాటిపై సంఘం తరపున చేసిన పోరాటాలు, ఎదురైన అనుభవాలు, విజయాలు చర్చించుకుని, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించు కునేందుకు నేటి మహాసభ దోహదపడనుంది.

- అష్టకష్టాలు పడుతున్న వ్యవసాయ కార్మికులు
- పనిదినాలు పెంచాలని, కూలిరేట్లు పెంచాలని సుదీర్ఘపోరాటం
- యాంత్రీకరణతో తగ్గిన వ్యవసాయ పనులు
- ఏటా తప్పని వలసలు
- నేడు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభ



సాగు భూములకు పట్టాలివ్వాలని జియ్యమ్మవలస తహశీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మికం సంఘం ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న పేదలు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో చెరకు, గోగు పంటలు అంతరిస్తున్నాయి. వాటి స్థానంలో పత్తి, మొక్కజొన్న, పామాయిల్, అరటి పంటలు విస్తరించాయి. వాణిజ్యా పంటలు విస్తరించడం, ముఖ్యంగా వరిసాగులో యాంత్రీకరణ పెరగడం వంటి కారణాల వల్ల వ్యవసాయ కూలీలకు పని దినాలు తగ్గిపోతున్నాయి. వ్యవసాయ పనుల కోసం ఐదు కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్ల వరకు ఆటోలపై ప్రయాణించడమే ఇందుకు తార్కాణం. జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో బాగా చదువుకున్న యువతీ, యువకులు కూడా ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత వ్యవసాయ కూలీల్లో ఆత్మస్థైర్యం పెరిగినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాల వల్ల శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదు. రెండేళ్ల క్రితంతో పోలిస్తే రోజువారీ కూలి రేట్లు తగ్గాయి. పనిదినాలు పెంచాలని సంఘం తరపున పోరాడుతున్నా కేంద్రం తనకు పట్టనట్టుగా వ్యవహరిస్తోంది. ఈ ఏడాది కేంద్రం మార్చిన సాఫ్ట్‌వేర్ వల్ల కూలీలకు నష్టం జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని ప్రశ్నించడం లేదు. ఉపాధి కూలీలకు ఆదాయం పెంచుతామంటూ ఉత్తుత్తి ప్రగల్భాలాలు పలుకుతోంది. రెండు పూటలా పనిచేయాలన్న నిబంధన, వేసవి అలవెన్సుల తొలగింపు వంటివి మరింత ఇబ్బందికరంగా మారాయి. దీనిపై సంఘం తరపున బలిజిపేట, సీతానగరం, మక్కువ, సాలూరు, కొమరాడ, పార్వతీపురం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల్లో ఆందోళనలు జరిగాయి.

జిల్లాలో లక్షల ఎకరాలు అసైన్డ్ భూమి, ప్రభుత్వ భూమి, అటవీ పోడు భూమి ఉంది. సాగు చేస్తున్న పేదలకు, గిరిజనులకు, దళితులకు, ఇప్పటికీ పట్టాలు ఇవ్వలేదు. సాలూరు, మక్కువ, పాచిపెంట, పార్వతీపురం, కొమరాడ మండలాల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పెత్తందారులు కొంత భూమిని ఆక్రమించుకున్నారు. వాటిని పేదలకు పంచాలని సంఘం పోరాడింది. గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం ఒక కుటుంబానికి 10 ఎకరాల వరకూ పోడు పట్టాలు ఇవ్వాలంటూ చేపట్టిన పోరాటం సుదీర్ఘకాలంగా సాగుతోంది. చాలా చోట్ల గిరిజనులకు పట్టాలు ఇప్పించడంలో సంఘం పాత్ర ఎనలేనిది. సాలూరు, మక్కువ, పార్వతీపురం, పాచిపెంట, కొమరాడ, జియ్యమ్మవలస మండలాల్లో భూ సమస్యలపై పోరాటం జరుగుతోంది. సాలూరు మండలం బోరబందలో 50 ఎకరాలు, జిల్లేడు వలసలో 35 ఎకరాలు, పాచిపెంట మండలంలో 748 ఎకరాలు పేదలకు ఇవ్వాలని చేపట్టిన పోరాటం కొనసాగు తుంది. మక్కువ మండలం వెంకంపేటలో 20 ఎకరాలు, పుల్లేరువలసలో 8 ఎకరాలు, మోసూరువలసలో8 ఎకరాలు, ఎస్.పెద్దవలసలో 13 ఎకరాలు పోరాడి పేదలకు, గిరిజనులకు ఇప్పించారు. పార్వతీపురం మండలం లచ్చన్నదొర వలసలో 60 ఎకరాలు, రావికోన పంచాయతీలో 50 ఎకరాలపై పోరాడుతున్నారు. కొమరాడ మండలం పెద్ద శాఖ లో 18 ఎకరాలు, సీసాడవలసలో 28 ఎకరాల అటవీ భూమిని గిరిజనులకు పోరాడి పట్టాలి ఇప్పించారు. జియ్యమ్మవలస మండలంలో కొండనిడగల్లు, చినదొడిజ,జబల్లేరు, కిడిగేసు, పెద్దొడిజ, నడిమిసిరిపి గ్రామాల్లో గిరిజనులకు 200 ఎకరాల అటవీ భూమి కోసం పోరాడి పోడుపట్టాలు సాధించారు. అలమండ , చంద్రశేఖరాజపురం, గడసింగపురం, గ్రామాల్లో సుమారు 200 ఎకరాల భూమి బంజరు సాగు చేస్తున్న పేదలకు పట్టాల కోసం సంఘం పోరాడుతోంది.

మరోవైపు భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలన్న డిమాండ్‌పై సంఘం నిరంతర పోరాటాలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో జరుగుతున్న మహాసభలు విజయవంతం కావాలని రైతాంగం ఆకాంక్షిస్తోంది.



డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉపాధ్యాయులకు ఎనిమిదో తేదీ వచ్చినప్పటికీ జీతాలు చెల్లించకపోవడాన్ని, అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలో 530 మంది హెడ్మాస్టర్లకు బైజుస్ కోసం ఫోన్ నెంబర్లు అప్డేట్ చేయలేదని నెపంతో షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ మంగళవారం స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ నిరసననుద్దేశించి యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ ప్రతినెలా 1నాటికి జీతాలు చెల్లించకపోవడం వల్ల ఉపాధ్యాయుల బ్యాంకులకు చెల్లించాల్సిన ఇఎంఐ కోసం సుమారు ప్రతినెలా వెయ్యి రూపాయలు జరిమానా చెల్లించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 8వ తేదీ వచ్చినప్పటికీ జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. మన్యం జిల్లాలో ఎక్కువ మండలాల్లో జీతాలు చెల్లించలేదని, కావున వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బై జ్యూస్ కంటెంట్ కొరకు ఫోన్ నెంబర్లు అప్డేట్ చేయలేదని మెమోలు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం చాలా ఎక్కువగా ఉందని, కొన్ని ప్రదేశాల్లో నెట్వర్క్ పనిచేయకపోవడం వల్ల అప్డేట్ అవ్వలేదని అన్నారు. బైజుస్ కంటెంట్ ఉపాధ్యాయులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రత్యామ్నాయం కాదన్నారు. ఈ సందర్భంగా మెమోలు ఉపసంహరించుకోవాలని, బైజూస్ గో బ్యాక్ గో బ్యాక్ అంటూ ఉపాధ్యాయులు నినదించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ జీతాల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని బైజుస్ కొరకు ఇచ్చిన మెమోలను సమీక్షించుకొని భవిష్యత్తులో పునరావృతం కానీయకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ధర్నాలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.మురళి, జిల్లా కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరావు, ఎం.పైడిరాజు, గోవిందమ్మ, కె.భాస్కర్‌రావు, వివిధ మండలాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలని

కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

అంగన్వాడీ హెల్పర్లకు జీవో 2 ప్రకారం ఉద్యోగోన్నతులు కల్పించాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు జి.జ్యోతిలక్ష్మి, వి.ఇందిర, ధర్మావతి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఖాళీ అయిన అంగన్వాడీ కార్యకర్తల స్థానంలో హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ పార్వతీపురం ప్రాజెక్టు పరిధిలో జీవో 2 అమలు చేయకుండా అధికారులు తాత్సారం చేయడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కొన్ని ప్రాజెక్టుల్లో ఉద్యోగోన్నతులు కల్పించి పార్వతీపురం ప్రాజెక్ట్ పరిధిలోని గోపాలపురం, గుణానపురం చిన్నబొండపల్లి, బాలగుడబ కేంద్రాల్లో అర్హులైన హెల్పర్లు ఉన్నా వారికి కార్యకర్తగా ఉద్యోగోన్నతి కల్పించకపోవడం సరైన విధానం కాదన్నారు. ఎన్నో పోరాటాలు ఫలితంగా సాధించుకున్న జీవో 2ను కూడా అధికారుల అమలు చేయకపోవడం దుర్మార్గమని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే జీవో 2 ప్రకారం అర్హులైన అంగన్వాడీ హెల్పర్లకు టీచర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అధికారులకు అనేక దఫాలు వినతులు ఇచ్చినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు జిఒ 2ను అమలు చేయాలని, లేనిచో అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిఆర్ఒకు, ఐసిడిఎస్ పిడికి వినతులు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు గొర్లి వెంకటరమణ, వై.మన్మధరావు, బివి రమణ, కొల్లి సాంబమూర్తి, గౌరీ, పార్వతి,తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాష్ట్రపతిని కలిసిన సిటియు విసి

విజయనగరం టౌన్ : గిరిజన సామాజిక వర్గం నుంచి అత్యంతన్నతమైన రాజ్యాంగ పదవిని పొందిన మహిళ ద్రౌపది ముర్ము అని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ టివి కట్టిమని అన్నారు. రాష్ట్రపతిని ఆయన ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలను తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన విశ్వవిద్యాలయ ప్రథమ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా (సందర్శకుని హోదాలో) రావాలని ఆహ్వానించారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందిం చారు. ఈ సందర్భంగా విసి కట్టిమని రాష్ట్రపతికి కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం స్థితిగతులను వివరించారు, అనంతరం గిరిజనుల విద్యకు సంభందించిన వివిధ సమస్యలు,వివిధ పరిష్కార మార్గాలకు సంబంధించిన అంశాలు చర్చకు వచ్చాయని విసి తెలిపారు. ఎన్ఇపి ద్వారా గిరిజన విద్యార్థులకు చేకూరాల్సిన వివిధ ప్రయోజనాలు చర్చకు వచ్చాయని ప్రొఫెసర్ కట్టిమని తెలిపారు.

రబీకి మడ్డువలస నీరు

విజయనగరం : వచ్చే రబీ సీజన్లో జిఎస్ఎన్ఎస్ మడ్డువలస ప్రాజెక్టు ద్వారా పదివేల ఎకరాల్లో పంటలు వేసేందుకు సాగునీటిని సరఫరా చేయనున్నట్టు ప్రాజెక్ట్ ఇఇ హెచ్. మన్మధరావు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని నాలుగు మండలాల పరిధిలో రబీలో మొక్కజొన్న సాగుకు నీటిని అందిస్తామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

గడపగడపకూ ప్రభుత్వంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. పట్టణంలోని 20వవార్డులో వడ్డివీధి, చినబజారు వీధి, కన్యకాపరమేశ్వరి ఆలయం వీధుల్లో మంగళవారం ఆయన ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. బింగి శ్రీనివాసరావు అనే వ్యక్తి మాట్లాడుతూ తనకు అమ్మ ఒడి, వాహనమిత్ర పథకాల కింద లబ్ధి చేకూర్చినట్లు చూపించారని, తమ ఖాతాలో డబ్బు లు జమ కాలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై రాజన్నదొర అక్కడే ఉన్న సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ సొంత వార్డులో ప్రజలు రాజన్నదొరకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, పట్టణ అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరిరఘు, రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, శ్యామలాంబ కోపరేటివ్ స్టోర్స్ చైర్మన్ మేడిశెట్టి అప్పలనాయుడు, వైస్ చైర్మన్ పి.మోహనరావు, వైసిపి నాయకులు హరి బాలాజీ, కొల్లి వెంకటరమణ, ఎపి నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రామారావు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని బొడ్డగూడ, మణిగ పంచాయతీలో గల మూలగూడ, కాశీ పురం, బొడ్డగూడ, ఎతంగూడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వి.కళావతి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందుతున్నాయా అనే అంశాలపై ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకం చేరాలన్నారు. యాతంగూడ గ్రామానికి పూర్తి స్థాయి రోడ్డు, రచ్చ బండను ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, మణిగ సర్పంచ్ కొండగొర్రి మంగ, ఎంపిటిసిలు టింగ అన్నాజీరావు, పాత్రుకాండ రాంబాబు, వైసిపి నాయకులు గెల్లంకి రమేష్, కాగితపల్లి కృష్ణ, ఎస్.కృష్ణమూర్తి, కొండగొర్రి చంటి, రామారావు, ఎపిఒ తులసీదాస్, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, చినబాబు, ఇంజనీరింగ్ సిబ్బంది శ్రీవిద్య, గౌరీ శంకర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



వడ్డివీధిలో ఇంటింటికీ తిరుగుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇంజనీర్ల అధికారుల సంఘం నాయకులు

పిఆర్ ఇంజినీర్ల సంఘం జిల్లా అధ్యక్షులుగా లక్ష్మణరావు

కలెక్టరేట్ : పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం జిల్లా అధ్యక్షులుగా బి.లక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయ ఆవరణలో పంచాయతీరాజ్ ఇంజినీర్ల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయితీ రాజ్ ఇంజనీర్ల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బి.లక్ష్మణరావు, ఉపాధ్యక్షులుగా ఎం.రామకుమార్, ప్రధాన కార్యదర్శిగా జె.చంద్రమౌళి, కోశాధికారి డి.లోకనాథం, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.వి.ఎల్.నారాయణగా ఎన్నికయ్యారు. విజయనగరం జిల్లా అధ్యక్షులు టివి రమణమూర్తి ప్రత్యేక పర్యవేక్షకులుగా వ్యవహరించారు. వసంత అప్పారావు, జి.శ్రీనివాసులు, ఎంవిఆర్ కృష్ణాజీ తదితరులు, పాల్గొన్నారు.

హెచ్ఎంపై పోక్సో కేసు నమోదు చేయాలి

సాలూరు : మండలంలోని కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్ఎం కృష్ణారావుపై పోక్సో చట్టప్రకారం కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.చందు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి మాట్లాడారు. హెచ్ఎం కృష్ణారావు తమను వేధింపులకు గురి చేశారని బాలికలు రెండు నెలల క్రితం చేసిన ఫిర్యాదుకు జిల్లా అధికారులు అండదేసినా ఇంతవరకూ స్పందించకపోవడం అన్యాయమని అన్నారు. పార్వతీపురం ఐటీడీఏ హెమంత నేతృత్వంలో ముగ్గురు మహిళా అధికారులు ఈనెల 5న నిర్వహించిన విచారణలోనూ బాలికలు అదే విషయాన్ని చెప్పారని తెలిపారు. జిల్లా అధికారులు చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈనెల 10న పార్వతీపురంలో ఎపి గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ, గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. అధికారులు చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తే అన్ని గిరిజన సంఘాలు, ప్రజాసంఘాలతో కలిసి పోరాడుతామని చందు హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు వరుణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ ఆలయం మూసివేత

పాలకొండ : చంద్రగ్రహణం సందర్భంగా ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం పాలకొండలో వెలసిన కోటదుర్గ అమ్మవారి ఆలయ తలుపులు దేవాదాయ శాఖ అధికారులు మంగళవారం మూసివేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ మాట్లాడుతూ గ్రహణం సందర్భంగా ఉదయం అర్చన అనంతరం ఆలయ తలుపు మూసివేసినట్లు తెలిపారు. గ్రహణం అనంతరం సాయంత్రం 6:30 నిముషాల తర్వాత శుద్ధి కార్యక్రమం, హోమం అనంతరం బుధవారం ఉదయం 6గంటల తర్వాత దర్శనాలకు అనుమతిస్తారన్నారు. భక్తులు బుధ గ్రహించి బుధవారం ఉదయం 6 గంటల తరువాత అమ్మవారి దర్శనాలు చేసుకోవాలన్నారు.

పిఎంఇజిపి ద్వారా ఉపాధి



ఎపిడి నారాయణరావు

సీతంపేట : ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ కార్యక్రమం (పిఎంఇజిపి)ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కలుగుతుందని వెలుగు ఎపిడి బి.నారాయణరావు అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. పిఎంఇజిపిలో 57 స్కీమ్స్ జెంట్స్ మిషన్ డైరీ పార్మ్ ఎక్స్ మిషన్ బెంట్ హోస్ పేపర్ ఫ్లేట్స్ వీడియో గ్రాఫ్ తదితర అంశాలు ఉన్నాయని, ఆసక్తి గల నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. వీటిలో 35 శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. అలాగే ఐటిడిఎ పరిధిలో టిఎస్‌పి ఏడు మండలాల్లో రూ.210 కోట్లు బ్యాంకు లింకేజీలు, లావాదేవీలు చేశామన్నారు. ఏడు మండలాల్లో 1056 గ్రూపులకు లక్ష 15వేలు సభ్యులు ఉన్నారన్నారు. 68 విఓలలు ఉన్నాయని, వీటి ద్వారా రైతుల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తున్నామని తెలిపారు. రూ.51 కోట్లు శ్రీనిధి ఇచ్చామన్నారు. బ్యాంకు లింకేజీలు అందించినప్పటికీ అదే స్థాయిలో రికవరీ కూడా చేస్తున్నామని అన్నారు.



సర్పంచ్ లోకనాథం ఆధ్వర్యాన రోడ్డుపక్కన పిచ్చిమొక్కలు తొలగిస్తున్న యువత

పంచాయతీని ఆహ్లాదకరంగా మారుస్తా

కురుపాం : పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తూ అహ్లాదకరమైన వాతావరణనికి అనుకూలంగా మారుస్తానని పెద గొత్తిలి సర్పంచ్ టి.లోకనాథం అన్నారు. తన గ్రామంలో మంగళవారం యువతతో కలిసి రోడ్డుకిరువైపులు ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగింపు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి అన్ని గ్రామాలకు వాలంటీర్ల ద్వారా యువతకు పిలుపునిచ్చి రహదారికి ఇరువైపులా ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి జీవకోటికి అవసరమైన ఆక్సిజన్ అందించే మొక్కలను రహదారి కిరువైపులు వేయించి గ్రామాలను ఆహ్లాదకర వాతావరణానికి అనుకూలంగా మారుస్తానని అన్నారు. అంతేకాక పంచాయతీలో ప్రతి గ్రామానికి తాగునీటి సమస్య లేకుండా చేశామని, ఇంకా ఏ గ్రామంలోనైనా తాగు, మౌలిక సదుపాయాలపైనా, సమస్యలు ఏమైనా ఉంటే తనకు నేరుగా తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

తంపటాపల్లి సచివాయాన్ని ఎంపిడిఒ సందర్శన

పాలకొండ రూరల్ : మండలంలోని తంపటాపల్లి సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినాధులు మంగళవారం సందర్శించారు. సచివాలయ సిబ్బందితో పాటు వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది వాలంటీర్లను సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు వర్తించేలా చూడాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం అంగన్వాడీ-2 కేంద్రాన్ని పరిశీలించారు. పిల్లలకు అందించే భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు రుచికరమైన భోజనాన్ని పెట్టాలని అంగన్వాడి కార్యకర్తకు సూచించారు.

పూతికవలసలో గ్రామసభ

సీతంపేట : మండలంలోని పూతికవలస సర్పంచ్ సవర యెశోని అధ్యక్షతన ఉపాధి హామీ పనులపై గ్రామ సభ మంగళవారం జరిగింది. సుమారు రూ.కోటీ 65లకు పనులను గుర్తించి ఆమోదించి తీర్మానించారు. అనంతరం ఎంపిడిఒ కె.గీతాంజలి మాట్లాడుతూ ఉపాధి పనులు పరిపాలన ఆమోదానికి కొత్త పనులు ప్రారంభించాలన్నారు. అలాగే గ్రామానికి అవసరమైన 40శాతం నిధులు సామాగ్రి రూపంలో ప్రాధాన్యత ప్రకారం గుర్తించి ఉపాధి నిధులు వినియోగించుకోవాలని సూచించారు. ఇంతకుముందు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఈ గ్రామసభకు ఈతమానుగూడ సర్పంచ్ పి.వీరన్న, సర్పంచ్ ప్రతినిధి సుభాష్ కార్యదర్శి కోలక శివాజీ, ఇసి ఆర్.సింహాచలం, టిఎలు, ఎఫ్ఎలు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను పూర్తిస్థాయిలో నిర్వహించాలి

కురుపాం : ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని గ్రామ స్థాయిలో పూర్తిస్థాయిలో నిర్వహించాలని జిల్లా వైద్యా అధికారి బి.జగన్నాథరావు వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సమావేశమయ్యారు. సందర్భంగా ఆస్పత్రి, గ్రామస్థాయిలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. గ్రామస్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేసి సక్రమంగా ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు. అనంతరం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వెయిటింగ్ హాల్ నుసందర్శించి అక్కడ గర్భిణీలకు అందుతున్న సేవలు గూర్చి ఆరతీసి వైద్య సిబ్బందికి పలు సూచన సలహారిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె జిల్లా కోఆర్డినేటర్ డి భాస్కరరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు భూమి పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

పేదలకు, గిరిజనులకు, దళితులకు భూమి పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని నిడగల్లులో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు చందనపల్లి కృష్ణారావు అధ్యక్షతన మండల మహాసభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న అనేక మందికి పట్టాలివ్వలేదని, పట్టాలిచ్చిన చోట చాలా మందికి భూమి చూపలేదని, అన్నారు. ఈ సమస్యలపై ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం ప్రభత్వం ఎత్తివేయడానికి కుట్ర చేస్తుందని, విద్య, వైద్యరంగాలను ప్రవేటీకరించి వ్యవసాయ కూలీలకు, పేదలకు విద్య, వైద్యం అందకుండా చేస్తున్నారని విమర్శించారు. రానున్న కాలంలో ఈ సమస్యలన్నింటి పైనా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈనెల 9న మక్కువలో జరుగుతున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయుకులు నక్క త్రినాథ, ఆర్, భాస్కరరావు, వై. రామారావు, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మక్కువలో ఈనెల 9న జరగనన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు జీగిరాంలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు అండగా ఉన్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 9న మక్కువలో జరిగే జిల్లా సభను జయప్రదం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు తౌడయ్య, పరమేశ్ పాల్గొన్నారు.

నేటి వ్యకాస మహాసభను జయప్రదం చేయండి




మండల సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

కొమరాడ : మక్కువలో ఈనెల9న జరిగే వ్యవసాయ కార్మిక సంఘం 9వ జిల్లా మహాసభలను ఆ సంఘం నాయకుల రెడ్డి శివున్నాయుడు, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఈ మేరకు వారు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సాయి రాం, చిన్నంనాయుడు, లక్ష్మణావు, కన్నంనాయుడు, మధుసూధనరావు పాల్గొన్నారు.

10న ఉచిత నేత్ర వైద్య శిబిరం

వీరఘట్టం : మండలంలోని వండువ గ్రామ జంక్షన్ వద్దగల సాయిబాబా ధ్యాన మందిరంలో ఈనెల 10న విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ వారిచే శ్రీకాకుళం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మజ్జి సింహాచలం మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. కంటి వ్యాధితో బాధపడిన వారు ఆరోగ్యశ్రీ, ఆధార్, ఏ విధమైన గుర్తింపు కార్డులుంటే తమ వెంట తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి ఆనంద్

గ్రామకంఠం రీ సర్వే చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

గ్రామ కంఠంలో స్వమిత్వ కింద రీ సర్వే చేయాలని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. స్వమిత్వపై మండల అధికారులతో మంగళవారం జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీ సర్వే కార్యక్రమం జిల్లాలో దాదాపు 150 గ్రామాల్లో రీ సర్వే జరిగిందని, దీంతో పాటు స్వమిత్ర రీ సర్వే చేయాలని ఆయన సూచించారు. షెడ్యూలు ప్రకారం గ్రామ కంఠంలో డ్రోన్ ఫ్లై చేయాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి నేతృత్వంలో పంచాయతీ రాజ్ బృందం ఒఆర్ఎ ఫోటో ప్రింటింగ్ కాపీతో గ్రామంలో పర్యటించి తప్పొప్పులు గుర్తించాలని పేర్కొన్నారు. అవసరం మేరకు సర్వే ఆఫ్ ఇండియాకు పంపించాలని ఆయన సూచించారు. జిల్లా సర్వే అధికారి 13 నోటిఫికేషన్ జారీ చేస్తారని అన్నారు. జిరాయితీ భూమి రీ సర్వే చేసిన విధానంలో స్వమిత్ర సర్వే ఉంటుందని చెప్పారు. దీనిపై ఇంజినీరింగ్ సహాయకులు ఇప్పటికే శిక్షణ పొందారన్నారు. వచ్చే మూడు రోజుల్లో మండల స్థాయిలో శిక్షణ జరగాలని, ఎంపిడిఒ, తహశీల్దార్, సర్వేయర్, ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శి హాజరు కావాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. గ్రామసభ నిర్వహించి తుది ఆర్‌ఒఆర్ రూపొందించాలని ఆయన చెప్పారు. ప్రతి భూమికి ఒక సర్వే సంఖ్య ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ జె.వెంకటరావు, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజకుమార్, ఇన్ ఛార్జ్ జిల్లా గ్రామ పంచాయితీ అధికారి తదితరులు పాల్గొన్నారు.

మహిళల స్వీయ రక్షణకు వారధి దిశా యాప్

పాలకొండ రూరల్:

దిశా యాప్ పట్ల ప్రతి బాలిక, యువతి, మహిళ అవగాహన కలిగి ఉండాలని దిశా స్టేషన్ మహిళా ఎస్ఐ బి.రేవతి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలికలు)లో ఇంటర్ విద్యార్థినిలకు దిశా యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దిశాయాప్‌ను జిల్లాలో ఇప్పటి వరకు అధిక సంఖ్యలో బాలికలు, యువతులు, మహిళలు డౌన్లోడ్ చేసుకున్నారన్నారు. ఈ యాప్ డౌన్లోడ్, వాడే విధానం వంటి అంశాలపై అవగాహన కల్పించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మహిళల భద్రతను కట్టుదిట్టంగా పెంచేందుకు దిశా యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ యాప్ పై అవగాహనను విస్తరించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన దిశా బృందాలు చురుకైన పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. దిశ యాప్‌పై విద్యార్థినులకు గల సందేహాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అడిగిన కొన్ని సందేహాలను ఆమె నివృత్తి చేశారు. ప్రిన్సిపల్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ దిశ యాప్ విద్యార్థినులకు, మహిళలకు రక్షక కవచం వంటిదన్నారు. దిశ యాప్ అనేది బాధ్యతగా ప్రతి విద్యార్థి డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సి ఎన్.ప్రతాప్, పిసి ఎం.క్రాంతి కుమార్, అధ్యాపకులు రమేష్, విజయ గౌరి, ముద్దుబాబు, సింహాచలం, లావణ్య, ధనలక్ష్మి, కృష్ణవేణి, రుక్షేనా బేగం, పుష్పనాథం, ప్రతాప్, జ్యోతి, శ్రీను, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

415 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పనుకువలస పంచాయతీ పెద్దచీపురువలసలో మంగళవారం 415 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి ఎ.సుభాష్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదచీపురు వలస గ్రామస్తులు పోలీసులకు అందించిన సమాచారం మేరకు ఎస్సై ఎంవి రమణ సిబ్బందితో కలిసి నాటు సారా అమ్మకందారులపై దాడులు నిర్వహించగా చిల్లూరి గంగరాజు, సేదు పరమేష్, గొర్ల పరమేష్, తోకల గంగులు, గొర్లె పాపారావు నుంచి 415 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. పరారీలో ఉన్న చిల్లూరి నూకరాజు, తాతను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. గ్రామంలో నాటు సారా అరికట్టేందుకు పోలీసులకు సమాచారం అందించిన పెద్దచీపురువలస గ్రామస్తులకు పోలీస్ శాఖ తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే అక్రమ నాటుసారా, గంజాయి రవాణాలకు పాల్పడుతున్న వ్యక్తులను పట్టుకొని కేసులు నమోదు చేస్తున్న ఎస్సై ఎంవి రమణ సిబ్బందికి రివార్డు అందజేసి అభినందనలు తెలిపారు. విలేకరుల సమావేశంలో సిఐ ధనుంజయరావు, సిబ్బంది పాల్గొన్నారు.




నాటుసారా స్వాధీనం చేసుకున్న డిఎస్‌పి, సిఐ, ఎస్ఐ

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - పాచిపెంట

కనీస మద్దతు ధర రైతులకు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, ఈ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు పారదర్శకంగా జరగాలని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు, సాంకేతిక సహాయకులకు ధాన్యం కొనుగోలుపై శిక్షణ ఇచ్చారు. ధాన్యంలో తేమ శాతం 17 కంటే తక్కువ ఉండేటట్లు చూసుకోవాలన్నారు. గ్రేడ్-ఎ రకానికి రూ.2060, సాధారణ రకానికి రూ.2040 మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. శిక్షణకు విచ్చేసిన సివిల్ సప్లై సాంకేతిక సహాయకులు జిఎల్ ప్రశాంతి, టి.రాజశేఖర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు మిల్లర్లకు ఎలాంటి పాత్ర ఉండదని, కొనుగోలు కేంద్రం వద్ద సాంకేతిక సహాయకులు నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాలే అంతిమమని అన్నారు. ధాన్యపు కొనుగోలులో రైతులు తమ ఇబ్బందులను టోల్ ఫ్రీ నెంబర్ 155251 లేదా 1902 ద్వారా తెలియజేయవచ్చని తెలిపారు. అనంతరం విఎఎలకు నమూనాల సేకరణ విధానం, పరిశీలనలో వాడే వివిధ పరికరాల వినియోగాన్ని వివరించారు. కార్యక్రమంలో పలువురు విఎఎలు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి


సిఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం పరిధిలోని వండువలో ఎమ్మెల్యే వి.కళావతి తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వీరఘట్టానికి చెందిన గొలుసు రూపవతికి రూ.75వేల విలువైన చెక్కును ఎమ్మెల్యే వి.కళావతి అందజేశారు. రూపవతికి మోకాలు వద్ద ఆపరేషన్‌కు సుమారు రూ.లక్ష ఖర్చు అవడంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడంతో ఆమెకు సహాయ నిధి కింద రూ.75వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జంపు ఉమామహేశ్వరరావు, వారాడ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పరస్పర సహకారంతో పట్టణాభివృద్ధి

పార్వతీపురంటౌన్ :పరస్పర సహకారంతోనే పట్టణ అభివృద్ధికి పూర్వ విద్యార్థులంతా కలిసి పని చేద్దామని టిట్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ అన్నారు. మంగళవారం తన నివాసంలో ఆయన పట్టణ ప్రజలతోనూ, వివిధ వ్యాపార వర్గాల వారితో సమావేశం నిర్వహించారు. పార్వతీపురం నుంచి దేశవిదేశాలు వెళ్లి, దేశంలో వివిధ ఉద్యోగాలు, వ్యాపారాలు, అభివృద్ధి అకాంక్ష ఉన్న నాయకులతో గత పది రోజులుగా సమావేశం ఏర్పాటు చేస్తూ పూర్వ విద్యార్థులంతా ఏకమై పరస్పర సహకారంతో సేవలు చేస్తూ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఇందులో భాగంగా బుధవారం రోయాల్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో చెక్క చంటి, పసుమర్తి బాలాజీ, చక్రధర్, కొరడా సురేష్, గ్రంధి వాసు, గౌరి, గెంబలి విజయ్, పూసర్ల నగేష్, వి.రమేష్, వైశ్యరాజు, వారణాసి, తదితరులు పాల్గొన్నారు.



అయ్యన్నపాత్రుడ్ని కలిసిన కురుపాం నియోజకవర్గ నాయకులు

అయ్యన్నపాత్రుడ్ని కలిసిన జగదీశ్వరి

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి తోయక జగదీశ్వరి, నాయకులు కలిసి టిడిపి సీనియర్ నాయకులు చింతకాయల అయ్యన్నపాత్రుడ్ని మంగళవారం నర్సీపట్నంలో తన ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైజాగ్‌లో జరుగుతున్న అవినీతిని ఎత్తిచూపుతుంటే అర్ధరాత్రి పూట అక్రమంగా అరెస్టు చేసి వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టిందన్నారు. ఆయన్ను జైల్లో పెట్టి కక్ష సాధింపు చర్యలు చేపట్టారని, ఆయన యోగక్షేమాలు తెలుసుకున్నామని, టిడిపి కార్యకర్తలకు, నాయకులకు ఎక్కడ అన్యాయం జరిగినా అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోలా రంజిత్ కుమార్, రామకృష్ణ, ఎం.భారతి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

జియ్యమ్మవలస : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని చిన మేరంగి ఎస్సై జి.కళాధర్ అన్నారు. మన ఊరు మన పోలీస్ కార్యక్రమంలో భాగంగా చినమేరంగిలో మంగళవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన దిశ, ఫోక్సో చట్టాలపైనా, నాటుసారా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల పట్ల గౌరవప్రదంగా ప్రవర్తించాని దురాలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. నాటు సారా తయారీ, అమ్మకాలు ప్రోత్సహించొద్దని అన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



లోకేష్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న పల్లవీరాజు

లోకేష్‌ను కలిసిన పల్లవీరాజు

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను మంగళవారం మాజీ ఎమ్మెల్యే శత్రుచర్ల చంద్రశేఖర్‌రాజు కుమార్తె పల్లవీరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గం రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతానికి చేస్తున్న కార్యక్రమాలపై చర్చించినట్టు తెలిపారు.

రైతు ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 10న పార్వతీపురంలో నిర్వహించనున్న మహాప్రదర్శనను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు కోరారు. మండలంలో పలు గ్రామాల్లో పర్యటన సందర్భంగా మంగళవారం నడుకూరులో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై చేపట్టే మహాప్రదర్శనకు రైతులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలచంద్ర మౌలీశ్వరరావు, బి.గోవిందరావు, సత్యంనాయుడు, రైతులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని అన్నవరం జంక్షన్‌లో మంగళవారం విజిలెన్స్ ఎస్సై రామారావు, బ్రేక్ ఇన్స్పెక్టర్ నవీన్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ సమీపంలో అక్రమ ఇసుక రవాణాపై ఆరా తీశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా అక్రమ ఇసుక రాంపుల వద్ద ఇసుక ఎత్తినచో కఠిన చర్యలు తప్పవన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రీచ్ లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు చెంతకు ఫ్యామిలీ ఫిజిషియన్

ప్రజాశక్తి కొమరాడ

ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంతో ప్రజల వద్దకు వైద్యం సక్రమంగా అందుతుందని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి అరుణ్ కుమార్ అన్నారు. మంగళవారం గంగరేగువలసలో వైద్య సిబ్బంది నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలో పలు ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. 104 వాహనంలో అందుబాటులో ఉండే ఇసిజి పరికరం ద్వారా గర్భిణీలకు పరీక్షలు చేశారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలను పరీక్షించారు. స్థానిక పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు, 104 సిబ్బంది , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు గిరిజన విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - సీతంపేట

ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు జరిగాయి. వీటిలో దోనుబాయి, పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్ఛార్జి జాకబ్ దయానంద్ తెలిపారు. ఎంపికైన వారిలో ఆరిక సింహాద్రి వాలీబాల్, సవర రవి కబడ్డీ ఉన్నారు. వీరిని ప్రధానోపాధ్యాయులు కొండగొర్రి సుబ్బారావు అభినందించారు.

నాడు-నేడు పనుల్లో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

నాడు - నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, సకాలంలో పూర్తిచేయాలని డిఎల్‌డిఒ పి.చంద్రమ్మ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ సూపర్వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కోట్లరూపాయిల వ్యయంతో జరుగుతున్న పనుల్లో, నాణ్యతగా జరిపించి, పాఠశాలలను తీర్చిదిద్దాలని, పనులకు సంబంధించిన నివేదికలు ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అకిబ్‌జావేద్, ఎంఇఒ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్లలో పెచ్చు మీరుతున్న ఆగడాలు

చోద్యం చూస్తున్న సచివాలయ, రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ పరిసర ప్రాంతాల్లో పేదల ఇళ్ల కోసం ఏర్పాటు చేసినవి జగనన్న కాలనీలా, జగడాల కాలనీలా అని జనసేన నాయకులు ప్రశ్నించారు. మంగళవారం జనసేన జిల్లా నాయకులు విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం పట్టణ సమీపంలోని కొత్తవలస, గోపాలపురం, మరికి, నర్సిపురం పరిసర ప్రాంతాల్లో జగనన్న లేఅవుట్లు ఏర్పాటును జగనన్న కాలనీల్లో గత కొద్దిరోజులుగా జగనన్న కాలనీలు, జగడాల కాలనీలుగా మారాయని ఎద్దేవా చేశారు. గతంలో తమకు కొత్తవలస, గోపాలపురం గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన జగనన్న లేఔట్‌లే ఇందుకు నిదర్శనమన్నారు. అధికార పార్టీ నాయకులు ఆయా కాలనీలో కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ కార్యాలయాల కోసం కేటాయించిన స్థలాలను అమ్మకాలు చేసుకుంటున్నారనే ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయన్నారు. కొంతమంది స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేయడమే కాకుండా అమ్మకాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా సంబంధిత సచివాలయ, రెవెన్యూ సిబ్బంది చోద్యం చూస్తున్నారన్నారన్నారు. తక్షణమే ఈ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళ చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో నాయకులు చందక అనిల్‌కుమార్, వి.దాలినాయుడు, బి.పవన్ కుమార్, సురేష్, శంకర్, తదితరులులు పాల్గొన్నారు.

నల్ల బియ్యంలో ప్రొటీన్లు అధికం

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

బ్రౌన్ రైస్‌తో పోలిస్తే బ్లాక్ రైస్‌లో ఎటువంటి కొలెస్ట్రాల్ లేకుండా ప్రొటీన్లు అధికంగా ఉంటాయని పరిశోధనలో తేలిందని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు తెలిపారు. నల్ల బియ్యంలో ఎన్నో పోషక పదార్థాలుండటం వల్ల ఎక్కువగా ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చన్నారు. నల్ల బియ్యంలో విటమిన్ ఇ అధికంగా ఉంటుందన్నారు. వీటితో పాటు మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, జింక్, ఫైబర్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా నల్ల బియ్యంలో అందోసేసిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉండడం వల్ల ఎన్నో రకాల క్యాన్సర్ల నుంచి మనకి విముక్తి కలిగేలా చేస్తుందన్నారు. నల్లబియ్యంలో లభించే ఫైనెడ్ ఫైటో కెమికల్స్ మధుమేహం వ్యాధి వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఇందులో ఉండే ఫైటో కెమికల్స్ ఇన్సులిన్ స్థాయిని మెరుగుపర్చేలా మన శరీరానికి అనుగుణంగా గ్లూకోస్ ఉపయోగించుకొనేందుకు కోసం రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. అందుకే మధుమేహం వ్యాధితో బాధ పడే వారికి నల్ల బియ్యం అధికంగా తీసుకోవడం వల్ల మధుమేహం వ్యాధిని నియంత్రించుకోవచ్చన్నారు. నల్ల బియ్యంతో చేసిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల మన శరీరానికి 60 శాతం ఐరన్, 40 శాతం ఫైబర్ అందిస్తుందన్నారు. ఇందులో ఫైబర్ అధికంగా ఉండడం వల్ల జీర్ణక్రియ సమతుల్యతను మెరుగుపరుస్తుందన్నారు. శరీరంలో ఉన్నటువంటి పిరియడికల్స్ బయటకు తొలగించడానికి ఇందులో ఉండే పోషకాలు దోహదం చేస్తున్నాయన్నారు. నల్ల బియ్యంలో ఉండే "జిమోకంటిన్" "లుటిన్" కరోటినాయడ్స్ ఆరోగ్యం మెరుగు పరుస్తుందన్నారు. మన శరీరంలో రక్త ప్రసరణను నియంత్రిస్తూ రక్త పోటు సమస్య నుంచి మనల్ని కాపాడుతుందన్నారు.



నల్లబియ్యం